క్లుప్తంగా

హరితహారం చెట్లు నరికివేత



అమ్మక్కపేట దారిలో నరికివేసిన చెట్లు

ఇబ్రహీంపట్నం: పర్యావరణాన్ని కాపాడేందుకు హరితహారంలో భాగంగా ప్రతీ ఏడాది భారీగా మొక్కలు నాటుతున్నారు. కానీ హరితహారంలో పెట్టిన మొక్కలు పెద్దవి కాగానే నరికివేస్తున్నా.. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి అమ్మక్కపేట వెళ్లే దారిలో రోడ్డు పక్కనే సుమారు 5 ఏళ్ల క్రితం హరితహారంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి సంరక్షించారు. రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే చెట్లను నరికివేసి కట్టెలను అమ్ముకుంటున్నారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సుఖ్‌దేవ్ తాపర్ జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న నాయకులు

కథలాపూర్: స్వాతంత్య్ర సమరయోధుడు సుఖ్‌దేవ్ తాపర్ జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో యువజన సంఘాలు, బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దేశానికి స్వాతంత్య్రం కోసం భగత్ సింగ్‌తో కలిసి పోరాటలు చేశారని వారు గుర్తు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, ప్రతాప్, అశోక్, గణేశ్, భాను పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్ హనుమాన్ ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు గంధ్ర కేశవరావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రఘు, సురభి నవీన్ రావు, వనతడుపుల అంజయ్య, రుద్ర శ్రీనివాస్, అన్ని కుల సంఘాల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ మండల టాపర్లకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా వారిని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. విద్యార్థులు తీగల మౌనిక, నక్క రుశేందర్, తునికి సన్నికుమార్, పిట్టల చరణ్‌ను సన్మానించారు. విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఉడుగుల రాజేందర్, వీడీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ పూడికతీత పనులను గురువారం కమిషనర్ మోహన్ పరిశీలించారు. వచ్చే వర్షాకాలం దృష్ట్యా వరద నీటితో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ పనులను చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఎక్కడైనా డ్రెయినేజీ సమస్యలు ఉంటే ప్రజలు శానిటేషన్ విభాగం దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. ప్రజలు కూడా ఇండ్లల్లో చెత్తను డ్రెయినేజీలో వేయకుండా మున్సిపల్ ఆటోలకు అందించి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేశ్ తదితరులున్నారు.

తీరిన రైతుల ఇబ్బందులు

- సొసైటీల ఆధ్వర్యంలో 16 గోదాములు నిర్మాణం
- రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ధాన్యం నిల్వలకు గోదాములు నిర్మించాలని రైతుల వినతి



భూషణరావుపేటలో నిర్మించిన సహకార సంఘం గోదాం

కథలాపూర్: రైతులు పంటలు పండించడం ఒక ఎత్తైతే... పంటలు సాగు చేయడానికి ముందు విత్తనాలు, ఎరువుల కోసం పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ప్రతీ పంటల సీజన్‌లో రైతులకు ఈ సమస్యలు ఎదురవుతున్నా ప్రభుత్వాలు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడంలేదనే విమర్శలున్నాయి. దీంతో కథలాపూర్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఒక ముందడుగు వేసి గోదాముల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. సంఘం పరిధిలోని గ్రామాల రైతులకు ఒక సీజన్‌కు సరిపడేలా ఎరువులు, విత్తనాలు నిల్వ ఉంచుకోవడానికి వీలుగా గోదాములు నిర్మించారు. వీటివల్ల సమస్య తీరినట్లయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 16 గ్రామాల్లో గోదాములు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా... భూషణరావుపేట, సిరికొండ, గంభీర్‌పూర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. భూషణరావుపేట సహకార సంఘం పరిధిలో 13 గ్రామాలున్నాయి. ఈ సహకార సంఘం నిధులతో 11 గ్రామాల్లో గోదాములు నిర్మించారు. ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో గోదాములు నిర్మించలేదు. సిరికొండ సహకార సంఘం పరిధిలో రెండు గ్రామాలుండగా.. రెండు గ్రామాల్లో గోదాములు నిర్మించారు. గంభీర్‌పూర్ సహకార సంఘం పరిధిలో నాలుగు గ్రామాలుండగా.. మూడు గ్రామాల్లో గోదాములు నిర్మించారు. తుర్తి గ్రామంలో గోదాం నిర్మించలేదని రైతులు తెలిపారు. గోదాములు నిర్మించడంతో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని, దూర ప్రాంతలకు వెళ్లే బాధలు తప్పాయని రైతులు పేర్కొంటున్నారు.



కథలాపూర్‌లో ఆగ్రోస్ కేంద్రం వద్ద విత్తనాల కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

ధాన్యం నిల్వల గోదాములు నిర్మిస్తే మరింత ప్రయోజనం..

గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు తొలగించడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రతీ సీజన్‌లో కొనుగోళ్ల సమయంలో వర్షం కురియడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. చేతికందిన ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయిన సందర్భాలెన్నో ఉన్నాయి. ధాన్యం తూకం వేసినప్పటికీ లారీల కొరతతో రోజులతరబడి బస్తాలు కేంద్రాల్లో ఉంటున్నాయి. అలాంటి సమయంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం గోదాములు నిర్మిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగాయి



గతంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కథలాపూర్ మండలకేంద్రానికి, మరికొందరు రైతులు పక్క మండలమైన రుద్రంగికి వెళ్లేవాళ్లం. అక్కడ గంటల తరబడి నిలబడితేనే ఎరువులు దొరికేవి. మా గ్రామంలో సహకార సంఘం ద్వారా గోదాము నిర్మించారు. గోదాములో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండడంతో రైతులకు ఇబ్బందులు తొలగినట్లే.

– గంగం గంగారెడ్డి, రైతు, కలిగోట

రైతుల సౌలభ్యం కోసం గోదాములు



రైతులకు పంటల సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సహకార సంఘం ద్వారా గోదాములు నిర్మించాం. సహకార సంఘం పరిధిలో 13 గ్రామాలుండగా.. 11 గ్రామాల్లో గోదాములు నిర్మించాం. రైతులు ఎక్కడికక్కడే గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు తీసుకునే సౌకర్యం కల్పించాం. రైతులు దూరం వెళ్లే అవస్థలు తప్పాయి. సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాం. ఈ గోదాములు నిర్మించడం వల్ల రైతులకు మరింత సౌలభ్యంగా ఉంటుంది.

– ఉశకోల అరుణ్, సీఈవో, భూషణరావుపేట సొసైటీ



సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టును అధికారులు తొలగింపజేశారు. ప్రమాదకరంగా ఉన్న చెట్టు పై ఈ నెల 8న వాట్సాప్ ఫోటో స్టోరీ వార్త రాగా, స్పందించిన ఎంపీడీవో చంద్రశేఖర్ గురువారం ఎండిపోయిన చెట్టును సిబ్బందితో తొలగింపజేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



అధికారులకు వివరణ ఇస్తున్న ఉపాధి సిబ్బంది

కథలాపూర్: ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లో రూ. 7.30 కోట్ల ఉపాధి పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. సామాజిక తనిఖీ నివేదికలను ప్రజావేదికలో సమర్పించారు. కూలీల హాజరు నమోదులో కీలకమైన మస్టర్లలో కొట్టి వేతలు, సరిదిద్దడం ఉండటాన్ని ఫీల్డ్ అసిస్టెంట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోయాయని తెలపగా నీటి సమస్య వల్ల ఎండిపోయాయని సిబ్బంది సమాధానమిచ్చారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో వీలైనంతా త్వరగా మొక్కలు నాటించాలని కార్యదర్శులను, ఫీల్డ్‌అసిస్టెంట్లను అధికారులు ఆదేశించారు. ఉపాధిహామీ రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని, పనుల్లో కాస్తా నిర్లక్ష్యం చేశారనే కారణంగా అధికారులకు, సిబ్బందికి కలిపి రూ. 38,109 జరిమానా విధించినట్లు తనిఖీ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, మల్లిఖార్జున్, ఎంపీడీవో శంకర్, ఎస్‌ఆర్పీ ప్రదీప్‌కుమార్, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముగిసిన వేసవి శిబిరాలు



కోరుట్ల శిబిరంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



ముగిసిన క్యాంపులో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోరుట్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలు విజయవంతమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర హైస్కూల్ తోపాటు గడి ప్రాథమిక పాఠశాలలో వేసవి శిబిరం ముగింపు సమావేశాలు ఆయా పాఠశాలల్లో వేర్వేరుగా గురువారం నిర్వహించారు. ఈ శిబిరాలకు హాజరైన విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించి, అల్పాహారం అందించారు. విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే ఆటలు, పాటలు డ్యాన్స్‌లు ఉత్సాహంగా నేర్చుకున్నారు. లైబ్రరీ బుక్స్ చదవడం, కథలు చెప్పడం, గణిత చదుర్విద ప్రక్రియలు, ఆంగ్ల భాషపై పట్టు సులువుగా సాధించినట్లు విద్యార్థులు తెలిపారు. టిఫిన్స్ పెట్టి, చక్కగా విజ్ఞానం, వినోదం అందించారన్నారు. పాఠశాల ప్రారంభమయ్యేదాకా వేసవి శిబిరం కొనసాగిస్తే, బాగుంటుందని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు సునావత్ రాజు, కృష్ణమోహన్‌రావు, అడ్డగట్ల శ్రీనివాస్, సీఆర్పీ గంగాధర్, ఇన్‌స్ట్రక్టర్స్ సంతోషిణి, వేణు, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో నూతనోత్సాహం

సారంగాపూర్: పాఠశాలల్లో వేసవి సెలవుల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నెలకొందని బీర్‌పూర్ ఎంఈవో సిరుప నాగభూషణం అన్నారు. బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, సీనియర్ ఉపాధ్యాయుడు లక్ష్మీనరసయ్య, పీడీలు లక్ష్మణ్, అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంతో పాటు గాంధీనగర్ ప్రైమరీ స్కూల్‌లో రూ.8లక్షలతో నిర్మించే గ్రంథాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సందర్శించి తమ మేధస్సును పెంచుకోవాలని అన్నారు. లైబ్రరీ సెస్ ద్వారా లైబ్రరీల ఏర్పాటు, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ధరూర్ క్యాంపులో రూ.కోటితో ప్రారంభించిన కేంద్ర గ్రంథాలయభవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో 11వ ఎస్సీ స్టడీ సర్కిల్, బీసీ స్టడీ సర్కిల్‌ను కూడా జగిత్యాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జగిత్యాలలో లేఅవుట్ ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని భవన నిర్మాణదారులకు సూచించారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, గిరి నాగభూషణం, డీఈ నాగేశ్వర్, ఏఈ శరణ్, నాయకులు బాలె శంకర్, ఆనందరావు, బొడ్ల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషి

జగిత్యాలక్రైం: మలేషియాలో మృతిచెందిన హబ్సీపూర్‌కు చెందిన కారం నర్సయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హబ్సీపూర్‌లోని నర్సయ్య కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. ఆయన వెంట నాయకులు ముస్కు నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మల్లాపూర్: జిల్లాలోని యాదవ బాధిత కుటుంబాలకు అండగా నిలిచి అన్నివిధాలుగా ఆదుకుంటామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దనరేకుల సంతోష్‌యాదవ్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లిలో ఇటీవల కరెంట్ స్తంభంపై పడి మాదం నాగరాజు విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు బండి మల్లేశ్‌తో కలిసి పరామర్శించారు.

మేధా స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



రక్షిత

రాయికల్: మండలంలోని భూపతిపూర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బొడ్డుపల్లి రక్షిత మేధ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. మేధా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 100 మంది ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి వీరిని ఆరేళ్ల పాటు ఇంటర్, ఉన్నత విద్య కోర్సులను ఉచితంగా చదివిస్తారు. ఈ సందర్భంగా రక్షితను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనుగోలు కేంద్రం సందర్శన



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జువ్వాడి

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం సందర్శించారు. కొనుగోలు విషయంపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు దరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సాయిని సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు హరీష్ గౌడ్, దేవయ్య, పోచమల్లు తదితరులున్నారు.

'రాజీవ్ యువ వికాసంపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు'

మల్లాపూర్: రాజీవ్ యువ వికాసంపై తప్పుడు ప్రచారం నమ్మొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్కా కమలాకర్ అన్నారు. మండలంలోని కొత్త దాంరాజుపల్లిలో గురువారం మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించిందన్నారు. ఈ పథకం ఎంపికలో దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ అవసరం లేదని స్పష్టం చేసిందని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ పథకానికి సంబంధించి కీలక ప్రకటన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గజ్జి గంగారెడ్డి, ఉత్కం హన్మాంతుగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుడిసె జితేందర్ లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలోని పలువురు వివిధ శస్త్రచికిత్సలతో పాటు ఆరోగ్య అవసరాలకు వైద్యసాయం పొందగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బాధితులకు ఈ చెక్కులను మంజూరు చేయించారని తెలిపారు. ఆయన వెంట ఆడెపు తిరుపతి తదితరులు ఉన్నారు.

మార్కెట్‌యార్డుకు 10 గుంటల స్థలం వితరణ



స్థల పత్రాలు అప్పగిస్తున్న దాత విజయ్‌రావు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో మార్కెట్ యార్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన బైర్నేని విజయ్‌రావు తమ తల్లిదండ్రులు బైర్నేని కాంతరావు–రాజవ్వల జ్ఞాపకార్థం 10 గుంటల సొంత స్థలాన్ని గురువారం గ్రామానికి దానం చేశారు. ఊరిలో మధ్యలో ఉన్న తమ 10 గుంటల స్థలాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సభ్యులు దాత విజయ్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న తహసీల్దార్, బ్యాంక్ మేనేజర్

కోరుట్ల: పట్టణంలోని గాయత్రి బ్యాంకు ఖాతాదారు శివరాత్రి సాగర్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఖాతాదారుడి తల్లి శివరాత్రి లక్ష్మికి రూ. లక్ష బీమా చెక్కు మంజూరు కాగా, గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ ఫారుక్ ఆమెకు అందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఫారుక్ మాట్లాడుతూ ఖాతాదరులకు కనీస డిపాజిట్‌తోనే బీమా సౌకర్యం కల్పించటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రో హిత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో కేజీఆర్ విద్యార్థుల సత్తా





అనుమల్ల ప్రుద్విక , ఆకాశ్





గౌతమ్‌రెడ్డి శివాని

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కేజీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. అనుమల్ల ప్రుద్విక 500 మార్కులకు గాను 481, అక్కనపల్లి ఆకాశ్ 467, గౌతమ్‌రెడ్డి 464, శివానీ 458, దివ్యశ్రీ 451, హారిక 446, గాయత్రి 444, అభిషేక్ 440, శ్రీనిధి 440, భానుశ్రీ 439, తరిణి 439 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సనత్‌కుమార్, పూర్ణచందర్ విద్యార్థులను అభినందించారు.



ఘనంగా పోలేరమ్మ బోనాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో పోలేరమ్మ జాతర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామం నుంచి దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి, దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గాలివానకు కిచెన్‌షెడ్ రేకులు ధ్వంసం



ధ్వంసమైన కిచెన్‌షెడ్డు రేకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిచెన్‌షెడ్డు రేకులు ఇటీవల వీచిన గాలివాన, ఈదురు గాలులకు కిచెన్‌షెడ్డు పైకప్పు రేకులు చెల్లా చెదురయ్యాయి. మన ఊరు మన బడి కింద కొత్తగా నిర్మించిన కిచెన్‌షెడ్డు రేకులు కొట్టుకుపోయి దూరంగా పడిపోయాయి. విద్యాసంవత్సరం ప్రారంభం లోపు కిచెన్‌షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం నర్సింహ్మామూర్తిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు పేర్కొన్నారు.